క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత

కడ్తాల్: మండల పరిధిలోని సాలార్‌పూర్‌కి చెందిన మూడవత్ సూర్తి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ శుక్రవారం పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. అదే విధంగా బాధిత కుటుంబానికి స్థానిక ఎంపీటీసీ ప్రియా రమేశ్ రూ.3వేలు ఆర్థికసాయం అందించారు. పరామర్శించిన వారిలో నాయకులు.. పంతునాయక్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహగౌడ్, జైపాల్, గోపాల్, పాండు, దేవుజా, కిషన్, స్థానిక నాయకులు ఉన్నారు.

గంధోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మైనార్టీ నాయకులు

ఆమనగల్లు: హైదరాబాద్‌లోని పురానాపూల్ వద్ద జూలై 1న నిర్వహించే హజ్రత్‌ఖాజీం పాషాఖాద్రి యాల్ మూసావియా 4వ గంధోత్సవ పోస్టర్లను ఆమనగల్లు మహ్మదీయ మసీదులో.. మసీదు కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ ఖాద్రి, మహ్మద్ అబ్దుల్ ఖాదర్ శుక్రవారం ఆవిష్కరించారు. గంధోత్సవానికి పెద్ద ఎత్తున ముస్లింలు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఇమామ్, అబ్బు, తాలిబ్, అక్బర్, చాంద్‌పాషా, మహబూబ్‌అలీ, ఖలీల్, అయూబ్, రహీం, కరీం, రహమాన్, బాసిద్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు అందజేత



ఎస్‌ఐ మారయ్యకు కెమెరాలు అందజేస్తున్న ఎంపీపీ

ఇబ్రహీంపట్నం రూరల్: శాంతి భద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేశ్ అన్నారు. మండల పరిధిలోని పోచారంలో ఎంపీపీ అభ్యర్థన మేరకు మురళీధర్ శుక్రవారం సీసీ కెమెరాలు అందజేశారు. వీటిని ఎంపీపీ కృపేష్.. ఎస్‌ఐ మారయ్యకు అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి

ఇబ్రహీంపట్నం రూరల్: సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయాలని ఓయూ బహుజన జేఏసీ నాయకులు చెరుకూరి రాజు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో మానుకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారయణను ఓయూ బహుజన జేఏసీ నాయకుడు రాజు కలిశి ఘనంగా సన్మానించారు. రాజు మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలన్నారు. గ్రూప్–2, 3, డీఎస్సీ అభ్యర్థుల డిమాండ్లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సత్యనారయణను కోరారు. నిరుద్యోగులకు న్యాయంచేయాలని కోరారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టండి



ఎంపీడీఓ వెంకటమ్మకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నేతలు

ఇబ్రహీంపట్నం: పొల్కంపల్లి, రాయపోల్ రహదారికి మరమ్మతులు చేపట్టాలని ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ వెంకటమ్మకు సీపీఎం నేతలు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాయపోల్ మాజీ ఎంపీటీసీ భిక్షపతి, సీపీఎం నాయకులు జగన్, రవి మాట్లాడుతూ.. పొల్కంపలి, రాయపోల్ రాహదారిని ఏళ్లక్రితం వేశారని.. ఇప్పుడు ఆ రోడ్డు కంకరతేలడంతో పాటు గుంతలమయంగా మారిందని అన్నారు. మూలమలుపుల వద్ద ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

'కేజీబీవీ'ని ప్రారంభించండి

కడ్తాల్: మండల కేంద్రంలో నిర్మాణం పూర్తయిన కేజీబీవీ పాఠశాల భవనాన్ని త్వరగా ప్రారంభించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని.. జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ కోరారు. శుక్రవారం మండల పరిధిలోని మైసిగండిలో అభివృద్ధి ప నుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేను.. దశరథ్‌నాయక్ కలిసి కేజీబీవీ పాఠశాల సమస్యలపై వివరించారు. వెంటనే పాఠశాల భవనాన్ని ప్రారంభించి తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని జెడ్పీటీసీ తెలిపారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

- పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక అవస్థలు
- రోడ్లపైనే చెత్తకుప్పలు, మురుగు
- రోగాలబారిన ప్రజలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



కళానగర్‌లో ఇళ్ల మధ్య చేరిన మురుగు

అబ్దుల్లాపూర్‌మెట్: మహా నగరానికి ఆనుకుని ఉన్నప్పటికీ ఆ పురపాలక సంఘంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. కాలనీల్లోని వీధులు, ప్రధాన రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ చెత్త పేరుకు పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ అవుట్‌లెట్ సరిగ్గా లేకపోవడంతో రోడ్లపై మురుగు నిలవడంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. ప్రతిరోజు వీధుల్లోని చెత్తను సేకరించి శుభ్రం చేయించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ఎక్కడ వేసిన చెత్త అక్కడే కుప్పలుగా పేరుకుపోయింది. వివరాల్లోకి వెళ్తే.. పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలో మొత్తం 24 వార్డులుండగా 150 వరకూ కాలనీలున్నాయి. కాగా పెద్దఅంబర్‌పేట నుంచి కోహెడా దారిలో, కుంట్లూర్ నుంచి పసుమాములకు వెళ్లే దారిలో, పసుమాముల నుంచి పెద్దఅంబర్‌పేటకు వచ్చే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా వేస్తున్న చెత్తను ఎప్పటికప్పుడు తరలించకపోవడంతో కుప్పలుగా దర్శనమిస్తున్నాయి. దీంతో పాటు డ్రైనేజీ అవుట్‌లెట్ లేకపోవడంతో మురికినీటితో పాటు వర్షపు నీరు కూడా ఇళ్ల మధ్యలోనే నిలిచి కుంటలుగా మారిపోయింది.

ఇళ్లలోకి చేరుతున్న మురుగు..

కళానగర్‌లో ఇళ్ల మధ్య నుంచే వరదనీటి కాలువ ఉండటంతో వర్షాలు కురిసిన ప్రతీసారి తమకు తిప్పలు తప్పడం లేదంటూ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరద కాలువపై కప్పు లేదా పైపులైన్లు కానీ ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పురపాలక అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని, తరచూ ఫాగింగ్ చేపట్టాలని, స్లమ్ కాలనీల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



కళానగర్‌పై అటు అధికారులకు, ఇటు ప్రజాప్రతినిధులకు ఎప్పుడూ చిన్నచూపే. ఎన్నికల సమయంలో మాత్రమే మేము గుర్తుకు వస్తాం తప్ప మా సమస్యలపై ఎవరూ స్పందించరు. వర్షం వచ్చిన ప్రతీసారి వరద నీరు మా ఇళ్లల్లోకి రావడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఉన్నతాధికారులు స్పందించి మా సమస్యలు పరిష్కరించాలి.

– మణెమ్మ, కళానగర్, పెద్దఅంబర్‌పేట

వ్యసనాలకు దూరంగా ఉండాలి

- షీ టీం డివిజన్ ఎస్‌ఐ శ్రీనివాసులు
- ఆదిబట్ల పాఠశాల విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసులు

ఇబ్రహీంపట్నం రూరల్: విద్యార్థి దశ నుంచే వ్యసనాలకు దూరంగా ఉండాలని షీటీం ఎస్‌ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదిబట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఇబ్రహీంపట్నం డివిజన్ షీటీం ఆధ్వర్యంలో విద్యార్థులకు గుడ్‌టచ్–బ్యాడ్‌టచ్, సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ఎస్‌ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ.. విద్యార్థులందరూ ఆన్‌లైన్ గేమ్స్‌కు దూరంగా ఉండాలని, సామాజిక మాధ్యమాల్లో అనేక రకమైన చెడు సమాచారం లభిస్తుందన్నారు. పోన్లకు అలవాటు పడి మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపిన ఫోన్ లింక్స్‌ను ఓపెన్ చేయరాదన్నారు. బాలికల పట్ల ఎవరైనా అభస్యంగా ప్రవర్తిస్తే వెంటనే షీటీంకు గానీ పోలీసులకు గాని తెలపాలన్నారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే 1930 నంబర్‌కు కాల్‌చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇచ్చే తినుబండరాలను తీసుకోవద్దని చెప్పారు. గతంలో జరిగిన కొన్ని మోసాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పరమేష్, ఉపాధ్యాయురాలు బబ్లీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పీవీ సేవలు చిరస్మరణీయం



కడ్తాల్: పీవీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

కడ్తాల్: దివంగత నేత, మాజీ ప్రధానమంత్రి పీవీ నర్సింహారావు దేశానాకి చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కడ్తాల్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నర్సింహారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. పీవీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుజాత, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, ఎంపీటీసీలు నిర్మలాదేవి, నాయకులు కాశీనాథ్‌రెడ్డి, కరుణాకర్‌గౌడ్, రాంచందర్‌నాయక్, మల్లయ్య, సత్యం యాదవ్, సిబ్బంది ఉన్నారు.

నివాళి అర్పించిన శ్రీనివాస్ యాదవ్

తలకొండపల్లి: దివంగత నేత, భారత దేశ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 103వ జయంతి వేడుకలను హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ హాజరై పీవీ నరసింహారావు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గుంతల దారి.. అవస్థలే మరి



గుంతలమయంగా ఆర్‌సీఐ ప్రధాన రహదారి

ఆర్‌సీఐ ప్రధాన రోడ్డుపై వాహనదారుల ఇక్కట్లు

- మరమ్మతులు చేపట్టాలంటున్న స్థానికులు

మీర్‌పేట: గుంతలమయమైన రహదారితో మీర్‌పేట కార్పొరేషన్‌లోని ప్రజానికం తీవ్ర అవస్థలు పడుతున్నారు. బిక్కుబిక్కుమంటూ రోడ్డుపై వెళుతూ నరకయాతన అనుభవిస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ చౌరస్తా నుంచి సూపర్ థియేటర్ వరకు గల రహదారి గోతులమయంగా మారడంతో రద్దీ వేళల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతలకు తోడు వర్షాకాలం కావడంతో రహదారిపై నీరు చేరడంతో ద్విచక్ర వాహనదారులు ఇటీవల అదుపుతప్పి కిందపడిన సంఘటనలు చాలా ఉన్నాయి. కార్పొరేషన్‌లో ప్రధాన రహదారి కావడంతో పాటు స్థానికులు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి కూడా దీని గుండా వెళ్లాల్సి ఉంటుంది. రహదారి అధ్వానంగా ఉండడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలగడంతో ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లే వారు సైతం అవస్థలు పడుతున్నారు.

గుంతలను పూడ్చిన ట్రాఫిక్ సిబ్బంది

వాహనదారుల ఇక్కట్లు, వాహనాలు మలుపు తీసుకునే ప్రాంతం కావడంతో గ్రహించిన ట్రాఫిక్ సిబ్బంది ఇటీవల ఇటుకలతో కూడిన మట్టిని తీసుకొచ్చి గుంతల్లో పోయించారు. మట్టితో కొంత మేర గుంతలు పూడ్చినప్పటికీ వారం రోజుల తరువాత పరిస్థితి మళ్లీ యథాస్థితికి వచ్చిందని, సంబంధిత అధికారులు స్పందించి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

వెల్జాల్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శేఖర్



నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న దాతలు, ఉపాధ్యాయులు

తలకొండపల్లి: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ప్రధానోపాధ్యాయుడు శేఖర్ అన్నారు. మండల పరిధిలోని వెల్జాల్ ప్రాథమిక పాఠశాలలో దాతల సహకారంతో సమకూర్చిన నోట్‌బుక్స్, కంపాక్స్ బాక్స్‌లు, పెన్సిళ్లు, పెన్నులు తదితర వాటిని శుక్రవారం ఆయన విద్యార్థులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఎక్సైజు శాఖ సీఐ శారదా దేవి, జానకి, సంధ్య, రిషిత తదితరులు ముందుకొచ్చి వారి సొంత ఖర్చుతో స్టేషనరీ సామగ్రిని అందజేసినట్లు తెలిపారు. వీరిలాగా మరింతమంది దాతలు ముందుకు వచ్చి నిరుపేదలకు సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్, ఉపాధ్యాయులు పద్మావతి, పెరిస్, నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్ దుష్పలితాలపై అవగాహన ర్యాలీ

ఇబ్రహీంపట్నం: దండుమైలారంలో పోలీసులు శుక్రవారం డ్రగ్స్ వలన కలిగే నష్టాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో.. యువత గంజాయి తీసుకోవడం వలన కలిగే దుష్పలితాలను వివరించారు. గంజాయిని విక్రయించినా, సేవించినా వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. తల్లిదండ్రుల పిల్లలను వ్యసనాల బారిన పడకుండా చూసుకోవాలన్నారు. పల్లెల్లో గంజాయి క్రయవిక్రయాలపై సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చనవారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

బడంగ్‌పేట్: బడంగ్‌పేటలోని డిగ్రీ కాలేజీలో 2024–25 విద్యాసంవత్సరానికి గాను వివిధ సబ్జెక్టుల వారిగా అతిథి అధ్యాపకుల(గెస్ట్ లెక్చరర్లు) నియామకం చేపడుతున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాధిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులనుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. బోటనీ–1, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్–1, కామర్స్–1, హిస్టరీ–1, పొలిటికల్ సైన్స్–1, మ్యాథమెటిక్స్–1, ఇంగ్లిష్–1.. మొత్తం 7 సబ్జెక్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హతలు పీజీలో మినిమం 55 శాతం మార్కులు (ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం), సంబంధిత సబ్జెక్టులో పీహెచ్‌డీ కలిగిన వారికి ప్రాధాన్యత ఇస్తారు. పీహెచ్‌డీ అభ్యర్థులు లేని పక్షంలో నెట్/సెట్ అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుంది. వీరు కూడా లేని పక్షంలో పీజీ అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. బోధన అనుభవం కలిగిన వారికి వెయిటేజీ ఇస్తామన్నారు. (సర్వీస్ సర్టిఫికెట్ సమర్పించాలి). జీతం బయోమెట్రిక్ అటెండెన్స్ ప్రకారం హవర్లీ బేసిస్ (72 గంటల ప్రాతిపదికన) గౌరవ వేతనం ఉంటుందన్నారు. అర్హులైన అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు పూర్తి బయోడేటాతో కూడిన దరఖాస్తులను జూలై 2వ తేదీలోపు బడంగ్‌పేటలోని డిగ్రీ కళాశాలలో సమర్పించాలన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వార్డుల అభివృద్ధికి కృషి

మున్సిపల్ ఛైర్మన్ మధుమోహన్



మాట్లాడుతున్న ఛైర్మన్ మధుమోహన్

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని వార్డుల అభివృద్ధికి కృషి చేస్తామని ఛైర్మన్ కాంటేకర్ మధు మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అన్ని వార్డుల్లో సీసీ రోడ్డు, అంతర్గత డ్రైనేజీల నిర్మాణం, తాగునీరు తదితర పనులకు గాను రూ.8కోట్ల80 లక్షల నిధుల ఖర్చుకు గాను కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్, ఏఈ భార్గవ్‌రెడ్డి, కౌన్సిలర్లు యాదగిరిరెడ్డి, అనిత, శివకుమార్, మౌనిక, పద్మ, తేజస్విని, హేమలత, విలాస్, రవినాయక్, సుమన్, భావన, రాజు, టీపీఎస్ రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టండి

బీజేవైఎం నేతల నిరసన



నిరసన తెలుపుతున్న బీజేవైఎం నేతలు

ఇబ్రహీంపట్నం: నియోజకవర్గంలోని శేరిగూడ గ్రామ పరిధిలోని శ్రీ ఇందు ఇంజనీరింగ్ కళాశాల వద్ద అసంపూర్తిగా వదిలేసిన బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యాదీష్, స్థానిక నియోజకవర్గ కన్వీనర్ రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలని శుక్రవారం బీజేవైఎం ఆధ్వర్యంలో అక్కడే టెంట్ వేసి నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ.. సుమారు రెండు సంవత్సరాలుగా అసంపూర్తి నిర్మాణంతో ఉన్న బ్రిడ్జితో వాహనాల రాకపోకలకు తీఇబ్బందులు కలుగడమే గాక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు నిండి అలుగుపారడంతోఈ రోడ్డుపై నుంచి వరద నీరు ప్రవహించిందని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అదరా బాదరాగా పనులు ప్రారంభించి వదిలివేసిందన్నారు. అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఆరు నెలలు కావస్తున్న బ్రిడ్జి పూర్తిస్థాయి నిర్మాణాన్ని చేపట్టకపోవడం సిగ్గుచేటన్నారు. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తక్షణమే స్పందించి బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజల ఇబ్బందులు తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ శ్రీశైలం, బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షులు నర్సింహారెడ్డి, శ్రీశైలం, దిలీప్ గౌడ్, శాంతికుమార్, విజయ్‌కుమార్, ఐలేష్, మహేశ్, సందీప్, బీరప్ప, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మహిళలు క్రీడల్లో రాణించాలి

మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి



విజేత జట్టుతో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

మీర్‌పేట: మీర్‌పేటలోని టీకేఆర్ కళాశాలలో వారం రోజుల పాటు జరిగిన ఉమెన్స్ టీ20 క్రికెట్ చాంపియన్‌షిప్ శుక్రవారం ముగిశాయి. పోటీల్లో ఆరు జట్లు పాల్గొనగా ఎలైట్ గరల్స్ విజేతగా నిలువగా, టీపీఆర్ అకాడమీ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేత జట్టుకు ట్రోఫీని అందజేశారు. మహిళలు క్రీడలో రాణించాలని, ప్రతిభకన బరిచిన వారికి కళాశాల తరపున స్కాలర్‌షిప్‌లు ఇచ్చి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత, మీర్‌పేట కార్పొరేటర్ అక్కి మాధవి, కోచ్‌లు కిరణ్‌రెడ్డి, దయానంద్ పటేల్, నిర్వాహకుడు ఈశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

దిష్టిబొమ్మలుగా ట్రాఫిక్ సిగ్నల్స్

- ఆమనగల్లులో జాతీయ రహదారిపై సిగ్నల్స్ ఏర్పాటు
- రెండేళ్లుగా ప్రారంభించని అధికారులు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు



రాజీవ్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సమస్య పరిష్కరించేందుకు ఇక్కడి రాజీవ్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేసి దాదాపు రెండేళ్లు కావస్తున్నా వాటిని మాత్రం ప్రారంభించడం లేదు. దీంతో లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ జాతీయ రహదారిపై దిష్టిబొమ్మలుగా మారాయి. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు కూడా లేకపోవడంతో తరచు ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

సమస్యను అధిగమించేందుకు..

హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై ఉన్న ఆమనగల్లు పట్టణంలో జాతీయ రహదారి దాదాపు 3 కిలోమీటర్లు ఉంటుంది. ఇదే రోడ్డు నుంచి షాద్‌నగర్ నుంచి మాల్‌కు వెళ్లే రోడ్డు ఉండటంతో స్థానిక పట్టణంలో రాజీవ్ చౌరస్తా ఉంది. హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో రాజీవ్ చౌరస్తా వద్ద వాహనాలు అటుఇటు వేగంగా తిరుగుతుంటాయి. దీంతో రాజీవ్ చౌరస్తా వద్ద ట్రాఫిక్ సమస్యలను అధిగమించడంతో పాటు ప్రమాదాలను నివారించడానికి రెండేళ్ల క్రితం ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేశారు. చౌరస్తా వద్ద నాలుగువైపులా లక్షల రూపాయలను వెచ్చించి సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. షాద్‌నగర్ రోడ్డు వైపు ట్రాఫిక్ పోలీసులు ఉండి ట్రాఫిక్ నియంత్రించేందుకు బాక్స్ ఏర్పాటు చేశారు. అయితే ఏళ్లుగడుస్తున్నా ట్రాఫిక్ సిగ్నల్స్‌ని మాత్రం ప్రారంభించడంలేదు. వెంటనే వాటిని ప్రారంభించి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.

రూ.250 కోట్లు మంజూరు చేయండి

- మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి
- కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ సందర్భంగా సీఎంకు విజ్ఞప్తి

పహాడీషరీఫ్: సీఎం రేవంత్‌రెడ్డికి మహేశ్వరం పట్ల ఏ మాత్రం అభిమానం ఉన్నా రద్దు చేసిన రూ.250 కోట్ల నిధులను వెంటనే మంజూరు చేయాలని ఎమ్మెల్యే సబితారెడ్డి విజ్ఞప్తి చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రపంచం, దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో ఆడ పిల్లలకు మేనమామగా మారి కల్యాణ లక్ష్మి పథకాన్ని అమలు చేశారని గుర్తు చేశారు. జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కొంత ఆలస్యమైనప్పటికీ ఈ ప్రభుత్వం ఎట్టకేలకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్‌లను అందించిందన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీకి అనుగుణంగా తులం బంగారం కూడా ఇవ్వాలన్నారు. పేదలు నివాసం ఉండే జల్‌పల్లి మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాల నిమిత్తం గత సర్కార్ ఎస్‌డీఎఫ్ కింద రూ.50 కోట్లు, హెచ్‌ఎండీఏ కింద రూ.45 కోట్లు మంజూరవ్వగా.. ఎన్నికల కోడ్ కారణం కూడా పరిగణనలోకి తీసుకోకుండా నాన్ స్టార్టెడ్ సాకుతో దాదాపు రూ.75 కోట్లు వెనక్కి తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో బాలాపూర్ తహసీల్దార్ మాధవీరెడ్డి, జల్‌పల్లి కమిషనర్ వాణిరెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, జనార్దన్, హామెద్, అర్జున్, దస్తగిర్, శంషూద్దీన్, యాహ్యా తదితరులు పాల్గొన్నారు. షాదీ ముబారక్ చెక్‌ల పంపిణీకి స్థానిక ఎమ్మెల్యే విచ్చేసినా జల్‌పల్లి మున్సిపాలిటీ చైర్మన్ అబ్దుల్లా సాది హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది.

ఆసక్తికర సన్నివేశం

చెక్కుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఓ లబ్ధిదారురాలి పేరు 'పట్లోళ్ల సునీతారెడ్డి' కావడంతో స్వయానా సబితారెడ్డి ఇంటి పేరు కావడంతో ఎమ్మెల్యేతో పాటు అందరూ ఆశ్చర్యానికి గురయ్యారు. తాను చేవెళ్ల వాసినేనని.. కానీ ఎన్నో ఏళ్ల క్రితం శ్రీరాం కాలనీకి వచ్చి స్థిరపడ్డామని ఈ సందర్భంగా ఆమె చెప్పుకొచ్చారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386